## క్లుప్తంగా

### యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

గడివేముల: సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చునని ఏఓ హేమసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని చిందుకూరు, గడిగరేవుల, గ్రంధివేముల గ్రామాల్లో సాగు చేసిన జొన్న పంటను ఏఓ పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం గడివేములలోని వెంకటేశ్వర, దుర్గాభవానీ మందుల దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఏఏలు చంద్రకంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి



ఏఈ మధుసూదన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ట్రూఅప్ సాకుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ మధుసూదన్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని హామీ ఇచ్చి నేడు బాదుడు మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ మండల కార్యదర్శి జీపీ వీరన్న, స్థానిక నాయకులు వీరన్న, వెంకటేష్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌టీయూ చట్టానికి విరుద్ధంగా ఫీజుల వసూలు

కర్నూలు(సెంట్రల్): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన జరగాల్సి ఉన్నా కొన్నింటిలో తల్లిదండ్రుల నుంచి ఫీజులను డిమాండ్ చేస్తున్నారని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సంబంధించిన ఫీజులను డిసెంబర్‌లో చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పినా కొన్ని పాఠశాలలు పట్టించుకోవడం లేదన్నారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.

### 22న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో ఈనెల 22వ తేదీన అథ్లెటిక్స్ విభాగంలో క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరత్నాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఈ ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

### కమ్యూనిజం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



సంచికను ఆవిష్కరిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ శత జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన కమ్యూనిజం ప్రత్యేక సంచికను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆవిష్కరించారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు కావడం సంతోషకరమన్నారు. ఈ నూరేళ్లలో అనేక పోరాటాలు, వాటి విజయాలను సంచికలో పొందుపరచినట్లు చెప్పారు. సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు మహేష్, అమినాబీ, శ్రీనివాసులు, చంటి, మునిస్వామి, మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.

### విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ వద్దు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణతో వినియోగదారులకు నాసిరక సేవలు, అధిక భారాలు తప్పవని ఏపీఎస్‌పీఈజేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్, చండీఘర్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు, అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతుబజారులో దళారుల ఇష్టారాజ్యం

- బోర్డుపై రాసిన ధరలను పట్టించుకోరు
- తూకాలు సక్రమంగా వేయరు
- ప్రశ్నించిన వారిపై దూషణలు, చీవాట్లు
- మహిళా వినియోగదారుపై చేయి చేసుకున్న ఓ వ్యాపారి



మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తికి భర్తతో కలిసి ఫిర్యాదు చేస్తున్న జైనాబీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్న వ్యాపారులు వినియోగదారులను దుర్భాషలాడటం, దూషించడం, చివరికి చేయి చేసుకోవడం వంటి వాటికి కూడా పాల్పడుతున్నారు. పేరుకే రైతుబాజరు అయినప్పటికీ దళారులు ఇక్కడ తిష్ట వేశారు. వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. తూకాల్లో దగా చేయడం, బోర్డుపై రాసిన ధరల కంటే ఎక్కువకు విక్రయించడం నిత్యకృత్యం అయ్యింది. బోర్డుపై రాసిన ధరలను దళారీలు పట్టించుకున్న పాపన పోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూరగాయలు, ఆకుకూరలు, కొత్తిమీర, కరివేపాకు వంటివి వారు ఇచ్చినవే తీసుకోవాలి. మంచివి ఏరుకోవడానికి ఏ మాత్రం అంగీకరించారు. పొరపాటున మంచివి ఏరుకోవడానికి ప్రయత్నిస్తే బూతులు తిడుతారు. అవమానకరంగా మాట్లాడతారు. చేయి చేసుకోవడానికి కూడా సిద్ధంగా ఉంటారు. రైతుబజారులో నిజమైన రైతులు ఉంటే ఇటు వంటి పరిస్థితులు ఉండవు. రైతుబజారు నిండా దళారులే ఉండటం వల్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుబజారు ఎస్టేటు అధికారి, ఇతర సిబ్బంది దళారులను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తే వారిపైనే ఎదరు తిరుగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దళారులను బలవంతంగా బయటికి పంపితే టీడీపీ నేతలతో ఫోన్ చేయించి 10 నిమిషాల్లో లోపలికి వస్తుండటం గమనార్హం.

**మహిళా వినియోగదారుపై చేయిచేసుకున్న వైనం**

రైతుబజారులో గురువారం ఒక మహిళా వ్యాపారి వినియోగదారుపై చెయ్యి చేసుకున్న వ్యవహారం కలకలం రేపింది. జైనాబీ అనే మహిళ కూరగాయల కోసం రైతుబజారుకు వెళ్లారు. కరివేపాకు తీసుకునేందుకు వరలక్ష్మి అనే వ్యాపారి వద్దకు వెళ్లారు. మంచి కట్ట తీసుకునేందుకు ప్రయత్నించగా జైనాబీని తీవ్రంగా దుర్భాషలాడారు. అంతేగాక ఆమెపై చేయి చేసుకోవడం గమనార్హం. సాటి వినియోగదారుల సమక్షంలోనే ఇది జరగడం తీవ్ర ఆందోళన కలిగించింది. మనస్తాపానికి గురైన మహిళ తన భర్తతో కలిసి రైతుబజారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్కడ తగిన చర్యలు తీసుకోలేదని గుర్తించి మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. రైతుబజారులోని వ్యాపారులు వినియోగదారుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నారని, కరివేపాకు కట్టపై చేయి వేసినందుకు వరలక్ష్మి అనే వ్యాపారి దుర్భాషలాడటంతో పాటు చేయి చేసుకున్నారని ఏడీకి వివరించారు. సదరు వ్యాపారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: ఓర్వకల్లు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు మూడు నెలల క్రితం చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలతో పాటు, చేపట్టాల్సిన లక్ష్యాల ప్రతిపాదనలు హాజరు కావాలని పేర్కొన్నారు.

### కుటుంబానికి భరోసా

కల్లూరు: మండల పరిధిలోని రేమడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆర్. వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి భరోసానిస్తూ ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, చాంద్‌బాష, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



పాల్గొన్న అధికారులు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2025 జనవరి నుంచి మార్చి వరకు రూపొందించుకున్న వంద రోజుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన కార్యాచరణ రూపొందించాలని జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలను ఆదేశించారు. ఈ ప్రణాళికలు సంబంధిత సబ్ కలెక్టర్లు, ఆర్‌డీఓల ఆమోదంతో రావాలన్నారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి రైతు రిజిస్ట్రేషన్లు 90 శాతం పూర్తయ్యాయని, డిసెంబర్ ఆఖరులోపు 100 శాతం సాధించాలని ఏపీ ఎంఐపీ పీడీ ఆదేశించారు. అటవీ శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కంటూర్ ట్రెంచ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నగర కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నగర వనాలు, నగర వాటికల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేసేలా ఎంపీడీఓలు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆర్అండ్‌బీకి సంబంధించి ప్యాచ్ వర్క్ పనులను సంక్రాంతి లోపు పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలకు కాంపౌండ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి రెండు నెలలు పూర్తయినప్పటికీ పనులను ప్రారంభించకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ శాఖకు సంబంధించి ఎఫ్‌పీ షాపుల డీలర్లను నియమించేందుకు ఎందుకు జాప్యం జరుగుతుందని డీఎస్ఓను ప్రశ్నించారు. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపాలిటీలకు సంబంధించి మున్సిపాలిటీ లేదా లోకల్ ఫండ్స్ ద్వారా ప్యాచ్ వర్కులను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి బ్లాక్ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వెంటనే పూర్తి చేయాలని, కోర్టు కేసులను నిర్లక్ష్యం చేయకూడదని, ప్రొసీజర్ ప్రకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వారం నుంచి స్పెషల్ ఆఫీసర్లకు కేటాయించిన ప్రదేశాలకు వెళ్లి తనకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డీఆర్వో సి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

### డిజిటల్ బోధనతో సత్ఫలితాలు



డిజిటల్ తరగతుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

కర్నూలు సిటీ: ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ తరగతులు ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అన్నారు. గురువారం మాధవనగర్‌లోని నారాయణ స్కూల్లోని ఎలైట్ విభాగంలో తల్లిదండ్రుల చేతుల మీదుగా డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేందుకు డిజిటల్ తరగతులు చక్కగా ఉపయోగపడతాయన్నారు. దీని వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఏఓ వెంకటేశ్వర్లు, వైస్‌ప్రిన్సిపాళ్లు నాగేశ్వరి, రాధ పాల్గొన్నారు.

## బాల్య దశలోనే అనారోగ్య సమస్యలు గుర్తించాలి



పిల్లల ఎత్తు, బరువు కొలుస్తున్న తీరును పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారిణి హేమలత

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో ఐదు సంవత్సరాలలోపే మెదడు, శరీరం ఎదుగుదల ఉంటుందని, బాల్యదశలోనే అనారోగ్య సమస్యలు గుర్తించడం ద్వారా వైద్య చికిత్స అందించి పూర్తిగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) అధికారిణి హేమలత చెప్పారు. గురువారం కర్నూలు నగరంలోని ఎన్‌టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల బరువు, ఎత్తు తీసిన తర్వాత పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి పోషకాహారం అందేటట్లు చూడాలని, తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పోషకాహార పునరావాస కేంద్రం(ఎన్‌ఆర్‌సీ)కి తరలించాలన్నారు. పుట్టుకతో వచ్చే లోపాలు, విటమిన్ల వల్ల వచ్చే వ్యాధులు, పిల్లల్లో పెరిగే దశలో వచ్చే వ్యాధులు, పిల్లల్లో అవయవాల పెరుగుదల లోపించడం వంటి వ్యాధులను ఉన్నట్లు గుర్తించిన పిల్లలను పెద్దాసుపత్రిలోని డైస్ ఓపీ నెంబర్ 43కు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాములు, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్త పద్మ, ఆశా కార్యకర్త నజీమున్నీసా, అంగన్‌వాడీ టీచర్ కేజియా, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

## భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్య వేదిక నాయకులు

కర్నూలు(సెంట్రల్): భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ ఐక్య వేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని జొహరాపురంలో దళిత భూములను కబ్జా చేస్తున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని విమర్శించారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు జయన్న, ఆంజనేయులు, రాముడు, నాగన్న,చాంద్‌బాషా,కాలిమియా, శేషమ్మ, నీలకంఠమ్మ పాల్గొన్నారు.

## దూదేకుల ప్లీనరీని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జమాల్ బాషా

గడివేముల: విశాఖపట్నం, పెందుర్తిలోని ప్రశాంత్ నగర్ పోర్టు కల్యాణ మండపంలో ఈ నెల శుక్ర, శనివారాల్లో జరిగే రాష్ట్రస్థాయి నూర్‌బాషా దూదేకుల ప్రతినిధుల ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు జమాల్‌బాషా కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రం గడివేములతో పాటు వివిధ గ్రామాల నుంచి దూదేకుల సోదరులు ప్లీనరీకి బయలుదేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెందుర్తిలో జరిగే ప్లీనరీలో ప్రతి దూదేకుల సోదరులు పాల్గొనాలన్నారు. ప్రభుత్వాలు మన కులాన్ని గుర్తించి మన సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. రాష్ట్రంలో దూదేకుల సామాజిక వర్గాలు ఇంతవరకు చట్టసభల్లో లేరన్నారు. ఇప్పటికైనా దూదేకుల సోదరలు ఐకమత్య చాటుకుని హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు యాసిన్‌బాషా, ఎక్స్‌ఆర్మీ జమాల్, మస్తాన్, జమాల్, చాంద్‌బాషా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రైతు వినతిని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

కోడుమూరు రూరల్: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని అనుగొండ గ్రామంలో గురువారం తహసీల్దార్ వెంకటేష్ నాయక్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హాజరయ్యారు. తహసీల్దార్, ఏడీఏ సాలురెడ్డితో కలిసి ఆయన స్వీకరించారు. ప్రతి వినతికి నిర్ణీత సమయంలోపు పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారును ఆదేశించారు. మొత్తం 12మంది రైతులు వివిధ రకాల భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు.

**నేడు వర్కూరులో రెవెన్యూ సదస్సు**

భూసమస్యల పరిష్కారంలో భాగంగా శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

కోడుమూరు: గూడూరు మండలంలోని మల్లాపురం గ్రామంలో గురువారం తహసీల్దార్ రామాంజినేయులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 7మంది రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బాలునాయక్, రీసర్వే డీటీ లోకేశ్వర రెడ్డి, వీఆర్వో ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో గురువారం తహసీల్దార్ విద్యాసాగర్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 43 వినతులు అందాయని తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో వీఆర్ఓలు నాగరాజు, బాలమద్దిలేటి, మధు, సర్పంచు గోవర్ధన్, స్థానిక నాయకులు నాగేశ్వరరెడ్డి, సీపీఎం నాయకులు రాష్ట్రకృష్ణ, నాగన్న, శ్రీధర్ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ త్వరలో సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో సాయిరమణ, సర్వే సహాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామంలో గురువారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 21దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. వీటిలో ఐదు వినతులకు సంబంధించి అక్కడే పరిష్కరం చూపామని చెప్పారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో గురువారం తహసీల్దార్ వెంకటలక్ష్మి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఉల్చాల గ్రామంలో శ్మశాన వాటికి చాలా చిన్నదిగా ఉందని, స్థలం కేటాయించాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

### పరిహారం చెల్లించి టవర్లు నిర్మించాలి

ఓర్వకల్లు: రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే విద్యుత్ టవర్లు నిర్మించుకోవాలని గుట్టపాడు గ్రామానికి చెందిన నరసింహరాజు, లక్ష్మన్న, పుల్లయ్య, సుంకులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జవన్ నేషన్ వన్ గ్రిడ్‌కెలో భాగంగా ఓర్వకల్లు పవర్ గ్రిడ్ నుంచి వివిధ ప్రాంతాలకు విద్యుత్‌ను సరఫరా చేసే క్రమంలో టవర్ నిర్మిస్తున్న రైతులకు మాత్రమే నోటీసులు ఇవ్వకుండా, ప్రక్క పొలాల రైతులకు కూడా నోటీసులు జారీ పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. టవర్లు నిర్మించిన రైతులతో పాటు ప్రక్క పొలం రైతులు వ్యవసాయం చేసే సమయంలో విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధు, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు

కల్లూరు: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశ ప్రజలు సహించరని ఏఐసీసీ మెంబర్, కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మి నరసింహ యాదవ్ హెచ్చరించారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టులోని దామోదర్ సంజీవయ్య భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీర్ హుస్సేన్, రజాక్ వలి, చిన్నయ్య, విశ్వేశ్వర్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

### బురాన్‌దొడ్డి ఎస్ఎంసీ చైర్మన్ మార్పు

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌ను మార్పు చేశారు. ఆగస్టు నెలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలలో గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లును చైర్మన్‌గా నియమించారు. తదనంతరం వెంకటేశ్వర్లు ఎస్ఎంసీ చైర్మన్‌కు అనర్హుడని గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్ ఆచారి, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు ఆరోపిస్తూ ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు వెంకటేశ్వర్లు అనర్హుడిగా భావించి, చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని సూచించారు. దీంతో వెంకటేశ్వర్లు తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా, గత ఎస్ఎంసీ కమిటీ సభ్యురాలైన ఉమామహేశ్వరమ్మను చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న కారు గురువారం మధ్యాహ్నం కల్వర్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు చెప్పారు. అలాగే పాణ్యం డొంగు వద్ద పాఠశాలకు వెళ్లి వస్తున్న ఓ విద్యార్థి రోడ్డు దాటే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. బైక్ ఢీకొని గాయాలు కావడంతో శాంతిరామ్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

## పేదల ప్లాట్లకు నంబర్లు వేయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో రెండవ విడత జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు నంబర్లు వేయించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ ఏడాది క్రితం నన్నూరు గ్రామానికి చెందిన పేదలకు 1338/ఎ2 సర్వే నంబరులో లేఅవుట్ వేసి, ఇంటి స్థలాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటకైనా అధికారులు స్పందించి ప్లాట్లకు నంబర్లు వేసి, పేదలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నూర్‌బాషా, విక్రం, చాంద్‌బాషా, జమాల్, శ్రీనివాసులు, శాలుమియ్యా తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి 24వతేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎంపీడీఓ ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. మండల పరిధిలోని సమస్యలకు ఇక్కడే పరిష్కారం చూపుతామని, జిల్లాస్థాయికి సంబంధించిన వినతులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

**24 వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరం**

కల్లూరు:ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక శిబిరాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి అన్నారు. గురువారం పీజీఆర్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సుపరిపాలనా వారోత్సవ కార్యక్రమములో భాగంగా ఈ నెల 19 నుంచి 24 వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు వివిధ సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే సమస్యలను పరిష్కారిస్తామన్నారు.

## అనుమతులు ఉన్న మందులనే విక్రయించాలి



మందుల అంగడిలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు పోలకల్, కంబదహాల్ గ్రామాల్లో గురువారం ఏఓ పర్యటించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల అనుమతులు, నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ యజమానులతో మాట్లాడుతూ అనుమతులు లేని మందులు, ఎరువులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ కంపెనీలకు చెందిన మందుల నమూనాలు సేకరించిన ఏఓ పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం, విశాఖపట్నం ల్యాబ్‌లకు పంపించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, డీలర్లు పాల్గొన్నారు.

## జాతీయ వర్కుషాప్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

కర్నూలు(సెంట్రల్): ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో జనవరి 8, 9, 10 తేదీల్లో విజయవాడలో నిర్వహించే జాతీయ వర్కుషాపును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు సురేష్ అధ్యక్షతన రాయలసీమ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వర్కుషాపులో చర్చిస్తామన్నారు. ముఖ్యంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంపై తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు రోడ్డున పడ్డారని, ఎంతో మంది ఉపాధికి దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు,శివరాం, రాధాకృష్ణ,మహ్మద్ మాలిక్, రవి, కుమార్ పాల్గొన్నారు.